
ఈ వారం తెలుగు పుస్తకం

# కొడవటిగంటి కుటుంబరావుగారి 'చదువు' - ఒక ఆత్మకథాత్మక సాంఘికచరిత్ర

డా|| టి.జి.ఆర్.ప్రసాద్




**Title:** Chaduvu
**Subject:** NOVELS
**Year of Publication:** 2004
**Price:** USD $ 1.73

కొడవటిగంటి కుటుంబరావుగారు తన కంటే పై తరగతి జీవితాన్ని పట్టించుకోలేదు. తాను అభిమానించే క్రింది తరగతి జీవితం గురించి రాయలేదు. అందుచేత ఆయన రచనల్లో జీవితంలోని వైవిధ్యం కానీ, వర్గాల మధ్య వుండే వైరుధ్యం కానీ అంచులలో తప్ప కేంద్రస్థానంలో కన్పించవు.

ఆయనది కత్తివాదరమేధ (Razor blade intellect).ఆయన చదువుకున్న శాస్త్ర పరిజ్ఞానం జీవితాన్ని శాస్త్రీయంగా విశ్లేషించడానికి ఉపకరించింది. అంకెలతో మనం కూడికలు, భాగారాలు, తీసివేతలు చేసినట్లు తన రచనలో ఆయన జీవితానికి లెక్కలు కట్టి పాఠకులకు సులభ గణితం నేర్పుతాడు. అందువల్ల ఆయన సాహిత్యం చదవకుండా తెలుగులో రచన చేయడానికి ప్రయత్నించడం ఎక్కాలు రాకుండా లెక్కలు చేయడమే అవుతుంది. సమాజంలోని కుళ్ళును చూసి ఆ ప్రవాహంలో కొట్టుకుని పోకుండా, ఆ సామాజిక సమస్యల పరిష్కారాన్వేషణలో బయలుదేరడం వల్ల, వారి శైలి ఉద్రేక రహితం అనిపించేటంతగా పరిణమించింది. తాను రాసింది పాఠకుల మనసుల్లోకి పాఠకులకు తెలియకుండానే వెళ్ళిపోవాలి. తాను మారుతున్నానని తెలియకుండా పాఠకుడి ఆలోచనా విధానం మారిపోవాలి, ఇదే కుటుంబరావులోని అసాధారణ మేధో లక్షణం.

పైన పేర్కొన్న విశేషాలు దాదాపు అన్నీ 'చదువు' నవలలో చూడవచ్చు. అందువల్ల ఈ నవలను కుటుంబరావు సాహిత్య తత్త్వ పరామర్శకు నమూనాగా గ్రహించవచ్చు.

శాస్త్రానికి, సాహిత్యానికి ప్రధాన భేదం ఈ ఆత్మీయత. అందువల్ల ఏ రచనలో అయినా కొద్దిగానో, గొప్పగానో, ప్రధానంగానో, అప్రధానంగానో; ప్రత్యక్షంగానో; ప్రకాశంగానో; అజ్ఞాతంగానో ప్రతి రచయితా తనవైన అనుభవాల్ని, అనుభూతుల్ని, అభిరుచుల్ని, ఆశయాల్ని తనకు తెలుసో, తెలియకో చొప్పిస్తుంటాడు. సామాజిక ప్రయోజనమే సాహిత్య లక్ష్యంగా భావించే రచయిత సాహిత్యంలో తానుపుట్టి, పెరిగి చవిచూసిన మధ్య తరగతి జీవితాన్నే రాయాలని కంకణం కట్టుకున్న రచయిత సాహిత్యంలో స్వీయ అనుభవాలు తప్పకుండా ప్రతిఫలిస్తాయి. ముద్రణ కాలక్రమణికను బట్టి చూస్తే 'చదువు' కుటుంబరావు నాలుగవ నవల. కానీ ఆయన జీవితం, వ్యక్తిత్వ వికాసం తెలుసుకోదగ్గవారికి యిది మొదటి నవల అని చెప్పవచ్చు. ఎందుచేతనంటే ఈ నవల రాయబడింది - 1950లో. కానీ ఇందులో తీసుకోబడిన ఇతివృత్త కాలం 1915-'35. ఆయన జన్మించింది అక్టోబరు 28, 1909 లో. నవలా ఆరంభ కథాకాలం నాటికి ఆయన వయస్సు రమారమి ఆరేళ్ళు. అంటే

జీవితం గురించి ఆయనకు చూచాయిగా గుర్తుండే వయసు. నవలాంతంలోని కాలం నాటికి ఆయన వయస్సు దాదాపు పాతిక ఏళ్ళు. అంటే జీవితాన్ని గురించి విమర్శించే స్థాయిలో ఉన్నా లేక పోయినా, జీవితాన్ని గురించి విమర్శించే స్థితికి ఎదుగుతుండే దశ. 6-26 ఏళ్ళ మధ్య ఆయనకు అనుభవం ఉన్న జీవితం యిందులోని - ఇతివృత్తం.

నవలలోని ప్రధాన పాత్రధారి సుందరానికి జీవితం చూచాయిగా తెలుసున్నప్పటి నుంచి యీ నవల ప్రారంభమవుతుంది. అది కుటుంబరావు బాల్యమే. అందుకే మొదటి ప్రపంచ యుద్ధ ఛాయలు, వైస్రాయి కారు ప్రయాణాలు, తిలక్ గాంధిని తుస్కాయిస్తున్న రోజులూ వ్యాఖ్యాన ప్రాయంగా మారిపోయాయి. నవల చివరలో ఆర్థికమాంద్య ప్రభావం వల్ల సీతమ్మ సంసారం ఆర్థికంగా చితికిపోయి సుందరం చదువు అసమాపక క్రియలా మిగిలిపోతుంది. కుటుంబరావు కూడా వ్యక్తిగతంగా ఈ డిప్రెషన్ ప్రభావానికి లోనైయ్యాడు. బెనారస్‌లో చదువుతున్న ఆయన యూనివర్శిటి చదువు అర్థంతరంగా ఆగిపోయింది. అందువల్లే ఆయన ఈ ఆర్థిక మాంద్యాన్ని, దాని వల్ల కలిగిన పరిణామాల్ని అనేక కథల్లో, నవలల్లో చిత్రించాడు.

తన జీవితంలో తాను చూసినవి, తాను అనుభవించినవీ రాసుకుంటూ పోవడం వల్ల సంఘటనల మధ్య తార్కిక సంబంధం ( **logical sequence**) అనాలోచితంగా, అప్రయత్నంగా సిద్ధించింది. జాతీయోద్యమంలో బొంబాయి కార్మికుల సమ్మె వంటి కొన్ని ముఖ్యమైన సంఘటనలు ఈ నవలలో ఎందుకు చోటుచేసుకోలేదు? ఆయన తన అనుభవాలను రాయటం వల్లనే... అని సమాధానం చెప్పకోవాల్సి వుంటుంది.

జరుగుతున్న చరిత్రను, జరుగుతున్న కాలంలో వ్రాయడం వేరు. జరిగిన చరిత్రను కొంతకాలం గడిచిన తర్వాత రాయటం వేరు. ఏ వయసులో కలుగుతున్న భావాల్ని ఆ వయసులో రాసుకుంటూ పోవటం వేరు. వయసు మీరిన తర్వాత గత జీవితాన్ని గురించి రాయడం వేరు. గడిచిన జీవితాన్ని కానీ, చరిత్రను కానీ రాయడంలో సాధికారత వుంటుంది. వివేచన వుంటుంది. సంయమం వుంటుంది. సరిగ్గా అదే జరిగింది ఈ నవలలో.

కుటుంబరావుది 'ఆర్టిస్టు' దృష్టి కాదు. 'సైంటిస్టు' దృష్టి. జీవితం పట్ల నిర్దిష్టమైన శాస్త్రీయ అవగాహన ఆయనకు ఉంది. అందుచేత జీవితంలోని సమస్యల పరిష్కారానికి మూలాలు అన్వేషించడంలో ఆయన శైలి ఆలోచనా ప్రేరకంగా, ఉద్రేకరహితమనిపించేటంతగా మారిపోయింది. విజయనగరం మహారాజా కాలేజిలో చదివిన ఫిజిక్స్ మెయిన్ బి.ఎ. చదువూ, డా॥ఎ.యల్. నారాయణ గారి గురుత్వం, బెనారస్ లో చదివిన అసంపూర్తి విద్య, అనేక శాస్త్రగ్రంథాల పఠనం, శాస్త్రగ్రంథాల అనువాదం - ఇవన్నీ ఆయన జీవనోపాధికి పనికి రాకపోయినా జీవితాన్ని పృథఃకరించి విశ్లేషించడానికి ఉపకరించాయి. ఈ శాస్త్రీయమైన విశ్లేషణ 'చదువు'లోనూ కన్పిస్తుంది. కుటుంబరావు జీవితంలోని కొన్ని సంఘటనలు యథాతథంగా ఇతివృత్తంలోకి ఎలా వచ్చేశాయో తెలుసుకుంటే ఆశ్చర్యం కలుగుతుంది.

కుటుంబరావు జన్మించింది తెనాలిలో. మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబంలో. ఈ నవలలో, చరిత్రకు లోనవుతున్న తెలుగుదేశ చరిత్ర, మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబాల ద్వారా వ్యక్తమైంది. ప్రధాన పాత్ర సుందరం మధ్య తరగతి బ్రాహ్మణ కుటుంబంలోని వాడే.

కుటుంబరావు తెనాలిలోని పాఠశాలలో చదివే రోజుల్లో జాతీయోద్యమ ప్రభావం తెలుగుదేశంలో వుంది. 1921లో అక్కడ ఒక జాతీయ పాఠశాల స్థాపించబడింది. రకరకాల చేతిపనులు ఆ పాఠశాలలో నేర్పేవారు.అవి కుటుంబరావును బాగా ఆకర్షించాయి. మామూలు బడి మాని దాంట్లో చేరాలనుకున్నాడు. ఆ నిర్ణయంలో దేశభక్తి, జాతీయోద్యమం వీటికి ఏ మాత్రం పాత్ర లేదు. కేవలం చేతి పనులంటే ఆసక్తి మాత్రమే. ఈ ఆసక్తి సుందరంలో కూడా కనిపిస్తుంది. అందుకే అతను 'స్వరాజ్యం' బడిలో చేరాలనుకున్నాడు. కుటుంబరావు ఈ బడిలో చేరకపోవడానికి కారణం ఆయన అన్న వెంకట సుబ్బయ్య. ఆ పాఠశాల ఎక్కువ రోజులు పని చేయకపోవచ్చునని, కొద్ది రోజులు ఆగి అభివృద్ధిని చూసి చేరమని ఆయన సలహా యివ్వడం వల్ల కుటుంబరావు ఆ బళ్ళో చేరలేదు. ఆయన అన్నట్టే అది కొంతకాలానికి మూత పడింది. సుందరం కూడా 'స్వరాజ్యం' బడిలో చేరదామదంటే అతని స్నేహితుడు నాగేశ్వరరావు, కుటుంబరావు అన్న సుబ్బయ్య లాగే "రెండ్రోజులాగి చేరమన్నాడులేరా మా నాన్న" అని నివారించడం చూడవచ్చు. సుందరం ఆ సలహా పాటించి అందులో చేరక పోవడం మేలౌతుంది. ఎందుకంటే అది రెండ్రోజుల్లో మూత పడుతుంది. అలా చేరిన రామ్మూర్తి చదువు కుంటుపడుతుంది.

కుటుంబరావు చిన్నతనం నుంచి తెలుగు సాహిత్యాన్ని చదవడం మొదలుపెట్టాడు. పదేళ్ళ వయసులోనే 'కన్యాశుల్కం' చదివాడు. తర్వాత వీరేశలింగం గారి నాటకాలు 'మహారణ్యపురాధిపత్యం' మొదలైన రచనలు చదివాడు, అలాగే నవలలో సుందరం కూడా చాలా చిన్నతనం నుంచే తెలుగు సాహిత్యాభిమానిగా కనిపిస్తాడు. ఆ నాటకాలనే, ఆ పుస్తకాలనే అతను చదివినట్లు కుటుంబరావు రచించాడు.

ఆంగ్ల సాహిత్యాన్ని కూడా కుటుంబరావు హైస్కూల్లో చదివేటప్పుడు అధ్యయనం చేయడం ప్రారంభించాడు, ఒక పాఠ్యాంశంగా ఉండే నాటకాలను, నవలలనూ పూర్తిగా చదివేవాడు. 'డేవిడ్ కాపర్‌ఫీల్డ్' మిల్ ఆన్ ది ఫ్లాస్ మొదలైన రచనలను ఆ విధంగా చదివాడు. ఇంటరు చదువుతుండగా కుటుంబరావు థామస్‌హార్డీ నవలలను పూర్తిగా చదివాడు, అలాగే కాలేజీ చదువులో ' ' Good Natured man' , 'she stoops to conquer' మొదలైన రచనలు కూడా చదివాడు. సుందరానికి యిదే అలవాటు ఉన్నట్లు, యివే పుస్తకాలను, యిదే విధంగా చదివినట్లు నవలలో ప్రస్తావింపబడింది.

H.G.Wells, Bernard Shaw రచనల్ని కుటుంబరావు కాలేజీ చదువు ముగిసాక సంపూర్ణంగా చదివాడు. చదువు నవలాంతంలో పూటకింత తిండి గతిలేక పోయినా కొడుకు అక్షరాలు గుర్తు పట్టే సమయంలో కూడా అతని చంకలో బెర్నార్డు షా నాటకాలు వున్నాయి. కుటుంబరావు లాగే సుందరం కూడా రచయిత కావడం మరో విశేషం.

"నేను ఇంటరు చదివేటప్పుడు సి.యస్.ఆర్ (19 ఏళ్ళ కుర్రాడు) మా హాస్టలుకు వచ్చాడు. అక్కడ అతని ఊరు కుర్రాళ్ళు ముగ్గురు, నలుగురుండేవారు. సి.యస్.ఆర్. గుంటూరులో రెండు నాటకాలాడాడు. మేం గేట్లలోనూ, అక్కడ నిలుచున్నాం. నాటకాలకు డబ్బు రాలేదు." అని ఆయన తన మొదటి కాలేజిలోని ఒక అనుభవం గురించి చెప్పకున్నారు. నవలలో సుందరానికి, అతని స్నేహితులకూ పొట్టి పేర్లతో పిలుచుకునే అలవాటు ఉంది. సి.యస్.ఆర్. ని నరుసు పాత్రలో చూడవచ్చు. నరుసు సుందరం వాళ్ళ కాలేజిలో నాటకం వేస్తాడు. దానికి డబ్బులు రావు. సుందరం కేవలం ప్రేక్షకునిగానే వుంటాడు.

కుటుంబరావుకు సంగీతంలో వున్న అభినివేశం సాహిత్యం పైన కూడా లేదని చెప్పవచ్చు. 1925 నాటికి ఎంకి పాటల మాధుర్యం ఆయన్ని బాగా ఆకర్షించింది. యువకుడుగా వున్న రోజుల్లో బాల గంధర్వ, బాబూరావు పెండార్కర్, నారాయణ్ వ్యాస్, రాచప్ప, వనజాక్షి, బెంగుళూరు తాయి మొదలైన వారి రికార్డులువినేవాడు. శాస్త్రీయ సంగీత సాధన చేసేవాడు. హార్మోనియంలో గోవిందరావు తెంబే ని అనుకరించే వరకు సాధన చేసేవాడు. బాల గంధర్వ పాట కోసం బొంబాయి వెళ్ళి అతని నాటకం చూసాడు. దీనానాథ్ మంగేష్కర్ కోసం బొంబాయి వెళ్ళి అతని మరణ వార్త విన్నాడు. ఈ సంగీతాభినివేశం నరసు పాత్రలో చూడవచ్చు.

కుటుంబరావు బొంబాయి వెళ్ళిన రోజులు రెండవ జాతీయోద్యమం పొంగుతున్న దినాలు. శాసనోల్లంఘనం చురుకుగా సాగుతోంది. కుటుంబరావు ఈ ఉద్యమానికి పూర్తిగా వ్యతిరేకం. శాసనోల్లంఘనం ఆయనకు అర్థం కాని పనిగా తోచింది. ఈ ఉద్యమ కారణంగా బెనారస్ విశ్వవిద్యాలయం నిరవధికంగా మూతపడింది. చరిత్రాత్మకమైన మీరట్ కేసు ఆయన అక్కడ వుండేటప్పడే జరిగింది. ఆ కుట్ర సందర్భంగా కొందరు విప్లవ కారులు యూనివర్శిటీలో వున్నారని కుటుంబరావుగారికి తెలుసు, కానీ వారితో వ్యక్తిగత పరిచయం లేదు. ఒకే ఒక విప్లవకారుని మాత్రం చూశారట. ఆ కాలంలో బెనారస్ విశ్వవిద్యాలయం అన్ని రకాల రాజకీయాలకీ ఆటపట్టుగా ఉండేది. ఉపాధ్యక్షుడైన మాలవ్యాజీ అన్ని రకాల ధోరణులకు ప్రవేశం కల్పించేవాడు. విద్యార్థులు ఏ మార్గంలోనైనా ఆలోచించడానికి గానీ, అనుసరించడానికి గానీ వారికా స్వేచ్ఛ ఉండేది. మతోన్మాదులకూ, విప్లవకారులకూ తమ అభిప్రాయాల్ని ప్రకటించుకునేటందుకు ఆ విశ్వవిద్యాలయం వేదికగా ఉపయోగపడేది.

బెనారస్ యూనివర్శిటీలో తన అనుభవాల్ని కుటుంబరావే యిలా చెప్పకున్నాడు:

"నేను కాశీలో ఉండగా చాలా జరిగాయి. జవహర్‌లాల్ అధ్యక్షతన ఇండియన్ నేషనల్ కాంగ్రెసు సంపూర్ణ స్వాతంత్ర్య లక్ష్యం ప్రకటించింది, భగత్సింగును, దత్తునూ ఉరితీశారు. దత్తు చెల్లెలు వచ్చి హాస్టలు వరండా మెట్ల మీద నిలబడి వణుకుతున్న గొంతుతో చుట్టూ మూగిన విద్యార్థులతో మాట్లాడింది. మా రక్తం ఉడికిపోయింది. హిందూ-ముస్లిం కొట్లాటలు జరిగాయి. యూనివర్శిటీలు మూసేసారు. కొట్లాటల మూలంగా కాదు. ఉప్ప సత్యాగ్రహాల మూలంగా. వినాయక దామోదర్ సావర్కార్ తమ్ముడు వచ్చి "ఇంగ్లీషు వాళ్ళు యివాళ కాక పోతే రేపు పోతారు. మనతో ఉండే శత్రువులు ముస్లిములు" అన్నాడు. ఒకరోజు విఠల్‌భాయి పటేల్ వచ్చి కొత్తగా కట్టిన జిమ్నాజియం హాలులో " **"We want freedom - Freedom with honour"** అని గర్జించాడు. సింహంలాంటి మనిషి. చాలా పొట్టివాడు. సింహం జూలు లాంటి గడ్డం. భయంకరమైన కళ్ళు. ఒకరోజు చాపకూడు ఏర్పాటు చేసి పాకీవాళ్ళ చేత వడ్డన ఏర్పాటు చేశారు. పండిత మాలవీయ రాడనుకున్నాం. వచ్చాడు. హిందు యూనివర్శిటీలో నేను ఏం చదువుకున్నానో నాకిప్పుడు జ్ఞాపకం లేదు. మానసిక స్వాతంత్ర్యం నేనక్కడ అనుభవించినట్టుగా అంతకు పూర్వం గానీ, ఆ తర్వాత గానీ అనుభవించలేదు. చదువు నవలలో బెనారస్ విశ్వవిద్యాలయంలో సుందరం అనుభవించిన మానసిక స్వాతంత్ర్యం, జీవితం నుంచి నేర్చుకున్న చదువు చిత్రించబడటం జరిగింది.

"సాహిత్యం సమాజంలోని చైతన్యంలోని ఓ శాఖ. సజీవంగా ఉన్నప్రాణికి నాళ్ళు ఆడటము, ఊపిరితిత్తులు పని చేయటమూ ఎంత తప్పనిసరో సజీవమైన సంఘానిక్కూడా చైతన్యం అంత తప్పనిసరి. ఇలా తప్పని సరైన

చైతన్యం సమాజంలో మార్పుకు తప్పనిసరిగా దారి తీస్తుంది." అంటారు కుటుంబరావు. అందుకే ఆయన 'చదువు' లో సమకాలీన జీవిత చిత్రణే ప్రాధాన్యత వహిస్తుంది.

చదువులో పాత్రలు సమకాలీన పరిస్థితులకు స్పందించడం ఒకవైపు , పాత్రలకేమీ సంబంధం లేకుండా కొన్ని పరిస్థితులను, అభిప్రాయాలను పాఠకులకే వదిలి వేయడం ఇంకోవైపు జరుగుతుంది. ఇది కుటుంబరావు రచనలోని ఒక విశిష్టత. సామాజిక జీవితం వ్యక్తుల మధ్య ఉండే సామాజిక సంబంధాల ద్వారా వెల్లడి అవుతుంది. నవలలో అయితే పాత్రల ద్వారా వ్యక్తమవుతుంది. కొన్ని చోట్ల రచయిత చేసిన వ్యాఖ్యానాల ద్వారా తెలుసుకోవలసి ఉంటుంది. సీతమ్మ, సుందరం, శేషగిరి, రంగారావు, శాస్త్రి మొదలైన ప్రధాన, అప్రధాన పాత్రల ఆలోచనలు, ప్రవర్తనల ద్వారా నాటి సమకాలీన జీవితం ప్రదర్శించబడింది.

జాతీయోద్యమం తన ప్రభావాన్ని ఆనాటి సాహిత్య ప్రక్రియలన్నింటి మీద ప్రభావం చూపినట్లుగానే నవల మీద చూపింది. ఇతర నవలల్లో లాగే 'చదువు' లోనూ ఈ ఉద్యమం ప్రతిబింబించింది, ఒక విధంగా ఈ ఉద్యమం నవలలో ఒక ప్రధానమైన పాత్రే నిర్వహించింది. ఉన్నవ లక్ష్మీనారాయణగారి 'మాలపల్లి' లో అంత గొప్పగా ప్రతిఫలించక పోయినా, వట్టికోట ఆళ్వారుస్వామి గారి 'ప్రజలో మనిషి' లోలాగ ఒకే ప్రాంతానికి చెందక పోయినా, అన్నింటిని సమ్మిశ్రితం చేసిన నవల ఇది. అయితే ' చదువు' ఉద్యమ నవల కాదు. అయిన పక్షంలో ఉద్యమ కాలంలో వచ్చి, ఉద్యమానికి వూపునిస్తూ, ఉద్యమావశ్యకతను చాటి చెపుతూ, అది జరగకపోయిన పక్షంలో జరిగే అవాంఛనీయ సామాజిక పరిణామాన్ని వివరించి ఉండేది. 'చదువే' కాదు కుటుంబరావు అసలు ఏ ఉద్యమ నవలనూ రాయలేదు.

నవలలోని ప్రధాన పాత్ర సుందరం జీవితంలోని మిగిలిన అన్ని అంశాల మాదిరే జాతీయోద్యమం గురించి ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ అందులోని లోటుపాట్లను బేరీజు వేసకుంటూ ఉంటాడే కాని దానిలో పాల్గొనడు. కేవలం సాక్షీభూతుడుగానే మిగిలిపోతాడు.

సుందరం బళ్ళో చేరిన రోజుల్లో బ్రిటీషు వాళ్ళు మొదటి ప్రపంచ యుద్ధంలో గెలవ కూడదని, అయినా గెలవ వచ్చనీ ప్రజలు అనుకుంటున్నారు. తిలక్ గాంధీ కంటే మిన్నగా వెలిగిపోతున్నాడు. చుట్టూ స్వాతంత్ర్య ఛాయలు అలుముకుంటున్నాయి. అయినా అవి సుందరానికి ఒంటబట్టలేదు. ఎందుకంటే అవి సుందరాన్ని వ్యక్తుల రూపంలో కదల్చలేదు.

తిలక్ చనిపోయిన తర్వాత కొనసాగించడ్డ గాంధీ సహాయ నిరాకరణోద్యమం పిల్లల సంభాషణల్లో, ఉపాధ్యాయుల ఉపన్యాసాల్లో ప్రస్తావించబడింది. వాటిని గురించి సుందరం హేతుబద్ధంగా ఆలోచిస్తాడు. "ఈ బ్రిటీష్ వాళ్ళ కింద ఎవ్వడూ పనిచేయకుండా వుంటే సరి. అప్పుడు వాళ్ళేం ప్రభుత్వం చేస్తారు" అని తన పరిధిలో బ్రిటీష్ వాళ్ళ కర్కశత్వాన్ని ఎలా ఎదిరించాలో ఆలోచిస్తాడు. ఇలా సనాతన తరం వైపు మొగ్గు చూపుతున్న సుందరం లాంటి ఆనాటి పిల్లల్లో బ్రిటీష్ వారి పట్ల వ్యతిరేకత ఎలా పుట్టిందో వాస్తవ ప్రోరకంగా చిత్రించబడింది. వేరొక రచయిత అయివుంటే జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని పుటల కొద్దీ వర్ణించి వర్ణించి తృప్తిపడివుండేవాడు. కానీ కుటుంబరావు పదేళ్ళ సుందరం మానసిక భావాల ద్వారా అతిసున్నితంగా ప్రదర్శించాడు. ఆ పసిపిల్లవాడి భావాలు యిలా వుంటాయి:

అధికారంలో ఉన్నవాళ్ళు యిటువంటి పనులు ఎట్లా చేస్తారు? ఎందుకు చేస్తారు? మనుషులకు ఎరుగని మనుషుల మీద ఎందుకింత ఆగ్రహం వస్తుంది? దొంగతనం చేసినవారిని జైల్లో పెట్టవచ్చు కానీ సభ చేస్తున్నవాళ్ళని చేతులారా ఎలా కాలుస్తారు? ఈ సంగతి ప్రపంచానికి అంతా తెలుస్తుందని వాళ్ళకు తెలీదా" అన్న ప్రశ్నలు సుందరాన్ని బాధించాయి. చెడుతనం, చెడ్డబుద్ధులు అన్నవి చదువుకున్న వాళ్ళలోనూ, అధికారులలోనూ వుండవని తక్కువ కులాల వాళ్ళలోనూ, కూలినాలి చేసుకునే అలగా జనంలోనూ, మంచీ మర్యాద లేకుండా జీవించే బిచ్చగాళ్ళు, రౌడీలు మొదలైన వాళ్ళలో మాత్రమే ఉంటాయన్న సుందరం భ్రమ ఈ సంఘటన వల్ల బాగా దెబ్బ తినింది.

ఉద్యమాన్ని నడిపే కార్యకర్తలకు ఉద్యమావశ్యకతను తెలియజెప్పి ప్రజల్ని చైతన్య పరిచే తెలివి తేటలు అంతగా ఉన్నట్లు తోచదు. వందలకొద్ది విద్యార్థులు వుండగా వాళ్ళను వెళ్ళవద్దని స్కూలు దగ్గర పికెటర్లు నిరోధిస్తారు. పికెటింగ్ చేసేవాళ్ళు కూడా విద్యార్థులు కారు. " ఒరే అబ్బాయిలూ మీరెవరూ స్కూళ్ళకి పోనక్కర లేదు. స్కూళ్ళు మానమని గాంధీ చెప్పాడు. ఆ మాటే నేను చెబుతున్నాను. ఇదిగో అభిమానం ఉండే వాళ్ళెవరూ లోనికి వెళ్ళకండి. సిగ్గుమాలిన వాళ్ళు పోతే పోవచ్చు నేనొద్దనను" అంటాడు ఓ కార్యకర్త. ఇదీ ఆనాటి కార్యకర్తల పరిస్థితి!

వృత్తి విద్యలు లేకుండా చేయడంతో ఇంగ్లీషు చదివితే కానీ ఉద్యోగాలు రాని పరిస్థితి ఏర్పడి విద్యావ్యవస్థ గందరగోళమయింది. స్వదేశీ ఉద్యమాలు కావాలని పికెటింగులు ఎక్కువయ్యాయి. జాతీయ విద్యాలయాలు అక్కడక్కడా మొదలయ్యాయి. కొండా వెంకటప్పయ్య, దుగ్గిరాల గోపాలకృష్ణయ్య లాంటి వాళ్ళు ఉపన్యసించే వాళ్ళు.

"...అయితే ఇంగ్లండంటే ఏమనుకున్నారు? మన మద్రాసు రాజధానంత కూడా లేదు. మనమంతా వెళ్ళి ఉచ్చపోస్తే మునిగిపోతుందన్నమాట. నేను చూసి వచ్చాలే" లాంటి పోచికోలు కబుర్లు, ఛలోక్తులు ఉండేవి కాని ప్రజల్ని చైతన్య పరిచేవిగా కనిపించవు.

ఇక్కడ ఉద్యమానికి ప్రభావితడై అందులో కార్యకర్తగా కనిపించే శేషగిరి సుందరానికి వరుసకు మామయ్య అవుతాడు. అప్పట్లో ప్రబలుతున్న గాంధీ ఉద్యమానికి, మధ్యతరగతి వాళ్ళలో ఉండే ఉద్యమాభిలాషులకు అతనొక నమూనాగా నిలుస్తాడు. ఉద్యోగాలను వదలి స్వరాజ్యం కోసం పాటుపడటం లక్ష్యంగా శేషగిరి లాంటి వాళ్ళు ప్రకటించారు. కానీ, చాలా మంది ఉద్యోగస్థులు ఉద్యమాల కన్నా ఉద్యోగాలకే ప్రాధాన్యత నివ్వడం, దాన్ని పట్టించుకోకపోవడం గమనించవచ్చు.

"ఇంటింటా రాట్నం తిరగాలి, ఊరూరా జాతీయ విద్యాలయం నడవాలి. అస్పృశ్యత పోవాలి. జనమంతా ఏకం కావాలి. నలభై కోట్ల గొంతులు 'వందేమాతరం వందేమాతరం' అని అరిస్తే స్వరాజ్యమే కాదు. దాని తల్లో జేజమ్మ కూడా దిగి వస్తుంది" అని శేషగిరి లాంటి వాళ్ళ విశ్వాసం కాబట్టే అలాంటి వాళ్ళు ఉద్యోగాలకు నీళ్ళొదిలారు. ఫలితం - మధ్యతరగతి వాళ్ళు కావడం వల్ల వాళ్ళ సంసారాలు ఆర్థికంగా దిగజారాయి. అలాంటి వాళ్ళే జాతీయ విద్యాలయాల్ని కూడా స్థాపించింది. అందుకే అవి మూడు తరగతులలో మొదలై మూన్నాళ్ళకే అస్పృశ్యత, ఆర్థిక కారణాల వల్ల మూల పడ్డాయి.

"ట్రైనింగ్ అయితే గాని టీచరుగిరి రాదు. 'లా' చదివితే గానీ ప్లీడరీ లేదు. ఇంజనీరింగ్, వైద్యం వేరే చదవాల్సిందే. ఇలా విద్య అంటూ కూర్చుంటే నూటికో కోటికో ఒకడు కూడా ఉద్యోగాలు చేయడు. చాలా మంది వృత్తులు చేసుకుంటారు. వ్యవసాయం, వడ్రంగం, కుండలు, కూజాలు చేయడం మొదలైనవి నేర్పేటందుకు ఒక్క బడీ లేదు. కనుక మన జాతిని నిర్జీవం చేసేందుకే ఈ ఆంగ్ల విద్య. దేశ చరిత్ర పేరున అబద్ధాలు రాశారు., బ్రిటీష్ వాళ్ళని ఎదిరించిన మన రాజులను మూఢ విశ్వాసానుబద్ధులుగా వాళ్ళు వాదించారు", అని బ్రిటీష్ వాళ్ళని ఎదిరించాలని శేషగిరి లాంటి వాళ్ళు వాదించారు. ఇక్కడ శేషగిరి మితవాదిగా, గాంధేయవాదిగా కన్పిస్తాడు. దేవాలయంలో హరిజనులకు ప్రవేశం కల్పించాలనీ, విద్యాలయాల్లో వాళ్ళను చేర్చుకోవాలని ప్రయత్నిస్తాడు. కానీ మిగిలిన వాళ్ళు పడనీయరు.

జైలు నుంచి తిరిగి వచ్చాక శేషగిరిలో వస్తుతః చాలా మార్పు వస్తుంది. తాను బాగుపడలేదు కాబట్టి యితరులు బాగుపడగలరనే నమ్మకం కదలబారుతుంది. జాతీయ విద్యాలయం మూలపడడం, హరిజనులకు యితర వర్ణస్థులతో సమాజంలో తాను అనుకున్నట్లు సమంగా ఆదరణ లభించక పోవడంతో అతను మానసికంగా కృంగిపోతాడు. అంతమాత్రాన గాంధీ మీద, ఆ ఉద్యమాల మీద విశ్వాసం వదల్లేదు. అదే అతని మతమైంది. కాబట్టి కొత్తతరం జాతీయవాదులను అర్థం చేసుకోలేక పోతాడు.

ఒకప్పుడు విధవా పునర్వివాహాలను సమర్థించినవాడే తన కుమార్తెకు బాల్యవివాహం చేస్తాడు. శేషయ్య లాంటి వాళ్ళలో ఆ సంస్కరణోద్యమ ప్రభావం పడినా అది భావజాలం వరకే పరిమితమౌతుంది గాని ఆచరణాత్మకంగా జరగలేదనీ గుర్తించ వలసి వుంటుంది.

"... మన చేతుల్లో ఉన్న విషయాలు కూడా మనం సంస్కరించుకోలేక పోతే యింక బ్రిటీష్ వాళ్ళని తరిమేసి రాజకీయ సంస్కరణలేమి చేసుకుంటాం?" అని ఒకప్పుడు శేషగిరి అంటాడు. ఇలా ఎన్నో ఉన్నతాశయాలు ఉండి కూడా సంఘం అడుగడుగునా అడ్డు తగిలే సరికి నిరాశ చెందుతాడు. ఆదర్శవాదులందరికీ ఎప్పుడో ఒకప్పుడు పట్టేగతి శేషగిరికీ పట్టింది. సంఘం మీద కొన్ని సంస్కరణలు పడవేయడానికి ప్రయత్నించి విఫలుడై చిట్టచివరికి ప్రాణం విసిగి ' ఈ పాడు సంఘానికి బాగుపడడం యిష్టం లేదు. దీనికి బాగుపడే గీత లేదేమో' అనే వైరాగ్యంలో పడతాడు.

ఇలాంటి శేషగిరి పాత్రను అధిగమిస్తూ అల్లుడు రంగారావు రంగంలోకి వస్తాడు. ఇతని పాత్రని పరిశీలిస్తే గాంధీ ఉద్యమంలోని లోటు పాట్లని విమర్శిస్తూ మాట్లాడే సుభాష్ చంద్రబోస్, జవహరలాల్ నెహ్రూలాలె మనకు కనబడతారు.

"ఒకవేళ బ్రిటీష్ వాళ్ళు వెళ్ళిపోతే మనం స్వరాజ్యం సాగించడానికి సిద్ధంగా ఉన్నామా? లేము. ప్రతి రాష్ట్రంలోనూ, ప్రతి జిల్లాలోనూ, ప్రతి పట్నంలోనూ, ప్రతి పల్లెలోనూ స్వరాజ్యం వేళ్ళు తన్నాలి. జీవితం అన్ని రంగాల్లో చైతన్యవంతం కావాలి. మనం రాజకీయాలు ఒక మూల నుంచి నేర్వాలి. కాంగ్రెసు సంస్థని నిర్మించాలి. దీని ద్వారా విద్యార్థులలో, ఉద్యోగులలో, ఆఖరుకు పొలం దున్నే రైతుల్లోనూ, ఫాక్టరీ కార్మికులందరిలోనూ చైతన్యం కలగాలి. ఇదంతా ఒక్కరోజులో జరగాలంటే సాధ్యం కాదు. కానీ, ప్రతి కాంగ్రెసు వాడు స్వార్థరహితంగా పని చేస్తే యివాళ ఒకడున్న చోట రేపు పదిమంది, పదిమందున్న చోట ఎల్లుండి నూరు మంది వుంటారు. ఆ విధంగా ఉద్యమం వ్యాప్తి చెందితే స్వరాజ్యం రాక ఏం చేస్తుంది." అని రంగారావు తన భావాల్ని ఉపన్యసిస్తాడు.

ఇందులో 1917 రష్యా విప్లవ ప్రభావం ప్రస్ఫుటమవుతున్నది. దానికి తోడు కాంగ్రెస్ యువ నాయకులైన బోసు, నెహ్రూల ధోరణి ప్రతిఫలిస్తుంది.

ఇక్కడ శేషగిరి వైరాగ్యం - రంగారావు ఆశామయ దృష్టి రెండు తరాలకు సంకేతాలు. ఇక మూడో తరం వాళ్ళు జాతీయ విప్లవవాదులు. వీళ్ళని బ్రిటీష్ సామ్రాజ్యవాదులు 'టెర్రరిస్ట్' లు అన్నారు.

ఆనాడు స్వాతంత్ర్యం యొక్క నిజమైన చైతన్యం సుందరం పై చదువులకు బెనారస్ వెళ్ళినప్పుడు అక్కడ విశ్వవిద్యాలయంలో దర్శనిమిస్తుంది. హిందూ జాతీయత తనకున్న అన్ని రంగుల్లోనూ కన్పిస్తుంది. రాజకీయ సిద్ధాంతాలకు అంతేలేదు. కాంగ్రెసు ప్రభావం అధికంగా వున్నా అనేక రాజకీయ భావాలు కలిగిన వాళ్ళు అక్కడుండే వాళ్ళు.

సుందరం కాశీలో గడిపిన రెండో సంవత్సరం రాజకీయంగా విలువైంది. అప్పుడు వైస్రాయిని టెర్రరిస్ట్‌లు చంపబూనడం, లాహోర్ కుట్రకేసు జరగడం, అక్కడి విద్యార్థినొకర్ని టెర్రరిస్టుగా గుర్తించి అరెస్ట్ చేయడం, 'సంపూర్ణ స్వరాజ్' నినాదాన్ని బోస్, నెహ్రూలు యివ్వడం లాంటివి విపరీతమైన సంచలనాన్ని కలిగించాయి. దీంతో అక్కడ యువకులు ఉద్యమంగా ముందుకు పోవడం జరిగింది.

ఇదే సమయంలో వినాయక దామోదర్ సావర్కార్ లాంటి మతోన్మాదులు ముసల్మానులకు వ్యతిరేకంగా జాతీయోద్యమాన్ని మరల్చడానికి ప్రయత్నం చేశారు. అదీ ఈ నవలల్లో కనిపిస్తుంది. సావర్కార్ విశ్వ విద్యాలయానికి వచ్చి "గాంధీ పిచ్చివాడు. తెల్లవాళ్ళు ఎప్పటికైనా పోయే వాళ్ళే. ఇక్కడే వుండి మనను ఎల్లకాలం పీడించే శత్రువులు ముసల్మానులు. వాళ్ళను నిర్మూలించాలి, అందరు హిందూ యువకులు కసరత్తులు చేసి కండలు పెంచండి" అని సలహా యిస్తాడు. ఇలాంటి మతోన్మాదులు ముసల్మానులను నిర్మూలించాలని పరమ భయానకంగా, జాతీయవాదాన్నే దెబ్బతీసే విధంగా ఉపన్యాసాలిచ్చి 'Main Stream' నే వెన్నుపోటు పొడవాలని ప్రయత్నించారు. అక్కడ సుందరం ఒకసారి ఆలీగఢ్ యూనివర్శిటీని చూడవచ్చిన ముసల్మానుల క్రమశిక్షణ, నాగరికతను చూసి " ఇంత క్రమశిక్షణ, నాగరికత వుండే ఈ ముసల్మానులు స్వాతంత్ర్యానికి ప్రతి బంధకులా?" అని ఆశ్చర్యపోతాడు. ప్రత్యక్షంగా మనని, రాజకీయ కబంధ హస్తాల్లో వుంచిన బ్రిటీష్ వారి పెత్తనం గురించి ఆలోచించవద్దంటూ భారతీయ సంస్కృతిలో, సహజంగా ఒక ప్రధాన అంగమైన ముసల్మానులను నిర్మూలించ మని ఉద్బోధించడం 'Religious Fanaticism' కు చిహ్నం తప్ప మరొకటి కాదు. ఒక వైపు బ్రహ్మాండంగా రష్యన్ విప్లవాన్ని ఉత్తేజంగా తీసుకుని భగత్సింగ్, భట్టకేశ్వర దత్తు, చంద్రశేఖర ఆజాద్ లాంటి వాళ్ళు తమ కార్యకలాపాల్ని విస్తృతం చేస్తుండంగా యిలాంటి మతోన్మాదశక్తులు ఉద్యమాన్ని వెన్నుపోటు పొడవడానికి ప్రయత్నించాయి.

కాశీలోనే ప్రత్యేకించి కొన్ని ఉద్యమాలు జరిగాయి. ఆ కాలంలోనే Territorial కార్యకలాపాలు దేశవ్యాప్తంగా కొనసాగుతున్నాయి. 'Hindustan socialist Republican Association' , 'అనుశీలన్ సమితి', గదర్ పార్టీ', 'నవభారత్ సభ' లాంటి సంఘాలూ, 'కీర్తి', యుగాంతర్', 'The Indian sociologist' లాంటి విప్లవ పత్రికలూ ఉద్యమ వాతావరణాన్ని యువకుల్లో కలిగించాయి. దానికి తోడు వారి సాహస కార్యకలాపాలు ఎందరో యువకుల్ని ఆకర్షించాయి. వాళ్ళలో కొందరు ఆయా సంఘాల్లో చేరారు. కొందరు సానుభూతిపరులుగా మారారు. సుందరం కూడా అభిమానిగా కనిపిస్తాడు.

"గాంధీజీ కేవలం నైతిక బలంతో బ్రిటీష్ వారిని ఎదిరించమంటున్నాడు. మేము నైతిక బలానికి భుజబలాన్ని కూడా జోడించమంటున్నాం అంతే తేడా. అందరి గమ్యస్థానం ఒక్కటే. మన శత్రువులు నైతిక బలాన్ని లక్ష్యపెట్టరు" అని జాతీయ విప్లవ వాదులు కరపత్రాన్ని యూనివర్శిటీ హాస్టల్‌లో పంచారు. వాళ్ళు ఎంతో సాహసంతో యిలాంటి భయంకర దినాల్లో కూడా తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెలువరించడం చూసి సుందరం ఆశ్చర్యపోయాడు.

ఇది యిలా ఉండగా శేషగిరి లాంటి ఆదర్శవాదులు చివరికి ఎంతో దయనీయమైన స్థితికి దిగజారి పోతారు. తనకున్న ఆదర్శాలు ఒనగూరక పోవడంతో ఆ అసంతృప్తి నిస్సహాయతగా, చేతగానితనంగా పరిణ మిస్తుంది, పేరుకు మాత్రం దేశభక్తులుగా చలామణి అయ్యే పరిస్థితి ఏర్పడుతుంది. శేషగిరి తన కొడుకు నరుసు తాను కూడా సత్యాగ్రహం చేసి జైలుకు వెళతానంటే "ఏడిచావులేవోయ్! నువ్వు జైల్లో కూచుంటే బండి నడిచేదెట్లా ?" అంటాడు. ఇక్కడ ఈ పాత్ర ఎంత నిస్సహాయ స్థితికి వచ్చిందో అర్థమవుతుంది. పెళ్ళిలో వరుడి కాశీ ప్రయాణంలా జాతీయోద్యమం లాంఛనప్రాయంగా మారిపోతుంది. ముందుగా ఎవరెవరు అరెస్టు కావాలో జాబితా తయారు చేయడం ప్రారంభిస్తారు. అంటే ఉద్యమంలో పని చేయకుండానే అరెస్టవుతే స్వాతంత్ర్యం వస్తుందనే అశాస్త్రీయ భావం; ఆచరణకూ, సిద్ధాంతాలకూ పొత్తు కుదరక పోవడం, నిర్వహణా దక్షత లోపించడం లాంటివి గాంధీ ఉద్యమాన్ని ఒక పక్క నీరసింప చేస్తుంటే నెహ్రూ, బోస్ లాంటి యువకులు కాంగ్రెసులో 'గుడ్డిలో మెల్ల' అన్నట్లు ఒక ప్రభంజనంలా ముందుకు రావడం, దాంతో ఉద్యమం ఒక వూపు నందుకోవడం జరుగుతూండగా వీటన్నింటినీ కాదంటూ సత్యాగ్రహం వల్లా, జైళ్ళకెళ్ళటం వల్లా, వస్త్రాలు తగలబెట్టడం వల్లా దేశం నుంచి బ్రిటీష్ వాళ్ళు పోతారంటే తనకు నమ్మకం లేదనీ, ఈ సారి ఉద్యమం వృథా అయితే తుపాకులతో పోట్లాడే వాళ్ళలో చేరుతా" అని గోపాల శాస్త్రి లాంటి వాళ్ళు అనడం పరిమిత ఉద్యమ కార్యనిర్వహణ పట్ల కలుగుతున్న అసంతృప్తిని తెలియచేస్తుంది.

ఇలా జాతీయోద్యమం మీద దృష్టి కేంద్రీకరించబడినా యింకో పక్క చిన్న పిల్లల పెంపకం గురించి ప్రస్తావించబడింది. ఇది నవల మొదటి భాగంలో కనిపిస్తుంది. పెంపకం గురించి రాయడం కుటుంబరావుకు చాలా యిష్టం. అందుకే చాలా నవలల్లో, కథల్లో ఈ ప్రస్తావన తెస్తుంటారు. చాలామంది తల్లిదండ్రులకు పిల్లల్ని ఎలా పెంచాలో తెలీదని ఆయన నమ్మకం. పిల్లల మానసిక స్థితి ఎలా వుంటుందో, వారు అనేక విషయాలను ఎలా గ్రహిస్తారో, బాహ్య వాతావరణం వాళ్ళు మానసికంగా, మేధోరూపంగా ఎదగడానికి ఎలా తోడ్పడుతుందో ఆయన గుర్తించాడు. చాలా మంది తల్లిదండ్రులు తమ పిల్లలు పెరిగి విజ్ఞానవంతులయ్యాక కూడా వాళ్ళని చిన్నపిల్లల లాగే తమ చాటు పిల్లలలాగే వుంచుకోవాలనే వెర్రి తహతహని గమనించాడు. ఎదుగుతున్న పిల్లలతో పాటే ఎదగలేక పోవడం చాలా మంది పెద్దల విషాదానికి కారణమని ఆయన అనేక కథల్లో , నవలల్లో తేల్చాడు. అచ్చంగా పైన చెప్పినవన్నీ 'చదువు' లో చూడవచ్చు.

సీతమ్మ పాత తరానికి ప్రతినిథి. సుందరం కొత్తతరానికి వారసుడు. తన తరం వాళ్ళతో పోలిస్తే సీతమ్మ ఒక అడుగు ముందుగానే ఉందని చెప్పవచ్చు. ఎందుకంటే తన తోటి ఆడవాళ్ళలా కాకుండా యింటా బయటా తనను నిరుత్సాహ పరుస్తున్నా, తాను అక్షర జ్ఞానం నేర్చుకుని సుందరాన్ని కూడా తీర్చి దిద్దడానికి ప్రయత్నించింది. భర్త శ్రీమన్నారాయణ సరైన ప్రోత్సాహం యివ్వక పోయినా అన్నీ తానై సుందరానికి లోకం

పోకడ చూపింది. అతనే ఆవిడకు సమస్త లోకం అయినా అతి గారాబం చేసిందే కాని క్రమశిక్షణ పేరుతో వారించిందే గానీ సుందరాన్ని చెడగొట్ట లేదు. తన మానసిక పరిధిలో లోటు లేకుండానే సుందరాన్ని సరిగ్గా పెంచింది. ఈ విధంగా ఆలోచిస్తే పాతకాలపు స్త్రీలలో సీతమ్మ ముందున్నట్లు తేలుతుంది. అయితే సుందరంతో పాటు ఎదిగే వయసు కానీ మనసు కానీ కాదు ఆమెది. సుందరం తల్లి స్వభావాన్ని గుర్తించడు. తనతో, తన భావాలతో పాటు పరిగెత్తలేది విసుక్కుంటాడే కాని ఆమెను సానుభూతిగా అర్థం చేసుకోవడానికి ప్రయత్నించక పోవడంతో ఆమె ఒంటరిదై పోతుంది.

మొదట్లో సుందరం పూర్తిగా తల్లి కొంగుచాటు బిడ్డ. అతను ఆ విధంగా పెరిగేలా సీతమ్మే వాణ్ణి పెంచి పెద్ద చేస్తుంది. ఈ దశలో సుందరం తల్లి చాటునుండే ప్రపంచాన్ని తల్లి చూసినట్లుగానే చూశాడు. అందువల్ల నవల మొదటి భాగం తెర నిండా సీతమ్మ ఆక్రమించుకొని వుంటుంది. తరువాత ఎదిగే కొద్ది తల్లి ప్రభావాన్ని విదలించుకొని, తన కాళ్ళ మీద తాను నిలబడుతూ, తనంతట తానుగా తెలుసు కొనే సమర్థుడుగా సుందరం ఎదుగుతాడు. అందువల్ల సీతమ్మ ప్రభావం క్రమక్రమంగా సన్నగిల్లడంతో నవలాంతంలో సీతమ్మ కనుమరుగై సుందరం తెరంతా ఆక్రమించుకుంటాడు. కూలిపోతున్న సాంప్రదాయ ఛాందసాలనీ, పాత నమ్మకాలనీ వదులుకో లేకపోవడం వల్ల సీతమ్మ తన సర్వస్వాన్ని ధారపోసి పెంచుకున్న ఒక్కగానొక్క కొడుక్కి దూరమయి పోతుంది. సుందరం పాత్రకి చారిత్రక విలువ ఉంది. ఎందుకంటే చారిత్రకంగా విలువైన కాలంలో అతను నూతన పంథా వైపు తన ఆలోచనలను మళ్ళించాడు. ఇలా చరిత్రకు లోనవుతున్న తెలుగుదేశంలోని బ్రాహ్మణకుటుంబాల్లోని సాంఘిక పరిణామాన్ని, రెండు తరాల మధ్య ఏర్పడ్డ అంతరాన్ని ఈ నవల గొప్పగా చిత్రించింది.

అలాగే మొదటి ప్రపంచ యుద్ధ ఫలితంగా సంభవించిన ఆర్థిక మాంద్యం నాటి తెలుగుదేశ జీవితాన్ని ఎలా ప్రభావితం చేసిందో కూడా 'చదువు' లో చూడవచ్చు. 1929 లో ప్రపంచానికి ముఖ్యంగా పెట్టుబడిదారీ దేశాలకు ఒక పెద్ద ఆర్థిక మాంద్యం దాపురించింది. అకస్మాత్తుగా వస్తువుల ధరలు పడిపోవడం, లక్షలాది మంది కార్మికులు నిరుద్యోగులు కావడం ఈ రోజుల్లో జరిగింది. బ్రిటన్ లోని ఈ మాంద్యం, దాని వలస దేశం కాబట్టి మనదేశం మీద కూడా ప్రభావాన్ని బలంగానే చూపింది. అది ఆంధ్రదేశానికి 1935 లో సంక్రమించింది. స్థిరాస్థులు గల కుటుంబాలు విపరీతంగా నష్టపోయాయి. వేలకు వేలు ఖరీదు చేసే పొలాలు వందల్లోకి దిగాయి. ఇలా ఆర్థికంగా దిగజారిన కుటుంబాలలో సుందరం కుటుంబమూ ఒకటి. కూతురి పెళ్ళి కోసమని, గర్భాధానం కోసమని భేషజాలకు సీతమ్మ పోవడం, సుందరానికి చదువు ధ్యాస తప్ప సంపాదిద్దామన్న యోచనలేక ఆ అప్పును గురించి తల్లి చెబుతున్నా పెడచెవిన పెట్టడం వల్ల సుమారుగా ఆస్తిపాస్తులున్న సంసారం అప్పుల పాలైంది. దానికి తోడు ఆర్థికమాద్యం. చదువు అసమాపక క్రియగా ముగిసింది. సంసారం వీధులపాలు కావడం ఒకటి తక్కువ. ఇలా ఆర్థిక మాంద్యం యొక్క ప్రభావం 'చదువు' లో రేఖామాత్రంగా స్పృశించి వదలి వేయబడింది. దాన్ని సమగ్రంగా చిత్రించిన నవల 'గడ్డురోజులు'. బ్రతకడానికి అవి ఎంత దుర్భరమైన దినాలో ఈ నవల్లో చూడవచ్చు. ఒక విధంగా దీన్ని 'చదువు'కు పొడిగింపుగా చెప్పకోవచ్చు. కానీ ఈ రెంటి నడుమా 'అరుణోదయం' ఉందని దానిలోని ఇతివృత్తాన్ని బట్టి నిర్ణయించవచ్చు.

మొదటి ప్రపంచ యుద్ధ ఛాయలు మొదలు డిప్రెషన్ వరకు; భావ కవిత్వం మొదలు అభ్యుదయ కవిత్వం వరకు; గ్రామాల్లో ప్రధానమైన వర్ణ వ్యవస్థ నుంచి పట్టణాల్లో ఉండే వర్గ వ్యవస్థ వరకు; జాతీయోద్యమం మొదలు కమ్యూనిస్టు ఉద్యమం వరకు తెలుగుదేశపు పల్లెల్లో, బస్తీల్లో పరిసర మహానగరాల్లో విద్యావంతులైన మధ్యతరగతి వర్గాల భావస్ఫూర్తికి, దాని పరిణామానికి ఈ నవల సాహిత్య రూపాన్ని యివ్వబూనుకుని చాలావరకు కృత కృత్యమైందని చెప్పవచ్చు.

" ఒక కాలానికి చెందిన నవలల్ని చదివేస్తే ఆ కాలపు సాంఘిక చరిత్ర చాలావరకు తెలిసిపోతుంది. ఈ చరిత్ర ఏ ఒక్క నవల్లో వుండటానికి వీలులేదు. ఎందుచేతనంటే నవలాకారుడు తనకు పరిచయమైన వాతావరణాన్ని, జీవితాన్ని, పాత్రలనీ మాత్రమే సృష్టించగలడు. 'చదువు' అన్న నవలలో డిప్రెషనుకు ముందు యిరవై సంవత్సరాల వాతావరణాన్ని చిత్రించయత్నించాను. అదే కాలాన్ని తీసుకుని మరి యిరవై మంది ఇరవై నవలలు రాయవచ్చు" అంటారు కొ.కు.

చదువు అంటే జ్ఞానం సంపాదించడం. ఈ జ్ఞానం రెండు విధాలు. పుస్తక జ్ఞానం. అనుభవ జ్ఞానం. ఈ అనుభవ జ్ఞానం ప్రత్యక్ష, పరోక్ష అని రెండు విధాలు. ఒక వ్యక్తి జీవితంలో ఎదరయ్యే అన్ని రకాల చదువులూ అపవాదులు లేకుండా చిత్రించిన నవల 'చదువు'. పల్లెటూళ్ళలో అరుగుబళ్ళ నుంచి, బెనారస్ వంటి నగరాల్లో ఉండే విశ్వవిద్యాలయం వరకూ అన్ని రకాల విద్యా సంస్థలు, వాటి స్వరూప స్వభావాలు సాకల్యంగా ఈ నవలలో వర్ణించబడ్డాయి. సుందరం తన పంచేంద్రియాల ద్వారా జ్ఞానాన్ని కష్టపడి ఆర్జిస్తాడు, అతని మొదటి గురువు తల్లి. ఆ తరువాత చిన్ననాటి స్నేహితులు. ఆరేళ్ళ సుబ్బులు నుంచీ, ఆనాటి కాశీ విశ్వవిద్యాలయం అధ్యక్షులు మాలవ్యాజీ వరకూ అందరూ అతని గురువులే. ఈ విధంగా నవల ఆద్యంతాలూ ప్రత్యక్షంగానో పరోక్షంగానో చదువును గురించి ప్రస్తావించడం వల్ల నవలకు ఈ పేరు సార్థకమయిందని చెప్పవచ్చు.

ఎవరి చదువైనా బడిలో వేయడంతో ప్రారంభం కాదు. దానికి ముందు నేపథ్యం వుంది. అది రాబోయే బడి జీవితాన్ని ప్రభావితం చేస్తుంది. ఈ పూర్వరంగ జీవితం మీద గృహం, దాని పరిసర వాతావరణ ప్రభావం వుంటుంది. దాన్ని బట్టి పిల్లలకు చిన్నతనంలో చదువు పట్ల భయభక్తులు కానీ; శ్రద్ధాసక్తులు కానీ; నిరాశా నిస్పృహలు కానీ; నిర్లక్ష్యం కానీ ఏదో ఒకటి ఏర్పడుతుంది. ఈ నేపథ్య జీవితం అతి మామూలుగా కనిపిస్తుంది. కానీ ఆ సమయంలో ఆరోగ్యకరమైన వాతావరణం లేకపోయినట్లయితే అవాంఛనీయమైన పర్యవసానాలకు అవకాశం హెచ్చు. మామూలు మనుషులు వాళ్ళు చేసే చిన్న పొరపాట్లు - అవి కలిగించే దుష్ఫలితాలను పైకి చెప్పని రీతిగా ప్రదర్శించడం కుటుంబరావు అలవాటు. ఈ అలవాటే నవలా ప్రారంభంలో కూడా గమనించ వచ్చు.

"*అమ్మా, నా అక్షరాభ్యాసం ఎప్పుడూ?*" అని సుందరం తన తల్లిని అడగడంతో 'చదువు' లో చదువు ప్రస్తావన మొదలౌతుంది. చాలామంది తల్లులకు పిల్లల్ని బెదరగొట్టడం చేతనయినంతగా వాళ్ళకి దానిమీద యిష్టం కలిగించడం చేతకాదు. పిల్లలు సహజంగా చేసే అల్లరికి వేగలేక చాలామంది తల్లులు 'బళ్ళో వేస్తాం' అని భయపెట్టడం చేస్తారు. మరికొంత మంది పిల్లలు బళ్ళోకి పోవడానికి లంచాలిస్తారు, చదువును గురించి పిల్లల ఎదుట ఎవరు కానీ అగౌరవంగా మాట్లాడినా పిల్లలకు దాని మీద భయమూ, అసహ్యమూ, అనుమానమూ, ఏదయినా కలగవచ్చు. కానీ సీతమ్మ మాత్రం కొడుక్కి చదువు మీద శ్రద్ధాసక్తులు కలిగించాలని తన శాయశక్తులా

కృషి చేసింది. అందుకే వాడు తల్లిని ఆ విధంగా అడిగాడు. అందులో బంధువులు వస్తారనే పిల్లల సహజమైన కోర్కెలేకపోలేదు.

కుటుంబరావుకు యింకో అలవాటుంది. ఏ సమస్యను కానీ ఒక్క తలంలో చూడడు. చూపడు. చెప్పే సమస్య యొక్క రెండు తలాల్నీ ప్రదర్శించి ఆ పరస్పర వైరుధ్యతల నుంచి పాఠకుడ్ని ఎటు పోవాలో తనంతకు తానుగా నిర్ణయించుకోమంటాడు. చదువు మీద పిల్లలకు శ్రద్ధాసక్తులను తల్లిదండ్రులు కలిగించాలని కానీ, అలాగే చదువు మీద పిల్లలకు భయభక్తులు కలిగించకూడదని కానీ ఆయన ఎక్కడా చెప్పడు. ఈ భిన్న ప్రవృత్తులు కల సీతమ్మ, సుబ్బమ్మలను ప్రదర్శించి వాళ్ళిద్దరి పెంపకంలోని పిల్లల ప్రవర్తనను చూపి ఆలోచన రేకెత్తించే విధంగా విశ్లేషించడం జరిగింది. పాఠకుడి సంస్కారాన్ని ట్టి వాడు ఏదో ఒక మార్గం స్వీకరిస్తాడు.

ఇక్కడ ఓ ప్రశ్న తలెత్తుతుంది. సీతమ్మకు తన కొడుకు చదువు పట్ల అంత శ్రద్ధాసక్తులు ఎందుకు ఏర్పడ్డాయి? *'చదువని వాడజ్ఞుండగు'* అని ప్రహ్లాదునితో హిరణ్యకశిపుడు అన్న ఒక్క భాగవత పద్యాన్ని చదువుకోవడం వల్ల ఆమెకు చదువు మీద యింత శ్రద్ధాసక్తులు ఏర్పడినాయని అనుకోవడం హాస్యాస్పదం. దానికి కారణం ఆనాటి సామాజిక నేపథ్యం.

జీవితంలోని అన్ని అంశాల్లాగే సమాజంలోని విద్యావ్యవస్థ ఆర్థిక విధానానికి అతీతంగా వుండటానికి వీల్లేదు. బ్రిటీషు వాళ్ళు **'Flag follows the trade'** పాలసీతో వచ్చి దేశంలో స్థిరపడి పోయారు. వలస ఆర్థిక వ్యవస్థను మనదేశంలో ప్రవేశపెట్టడం జరిగింది. దాంతో మన దేశంలోని ముడి సరుకులను చౌకగా కొని, అక్కడి వారి యంత్రాలతో పరిశ్రమలు స్థాపించి, వినియోగ వస్తూత్పత్తిని విరివిగా సాగించారు. దానితో అక్కడ ఉత్పత్తి పెరిగి డిమాండ్ తగ్గిపోయింది. ఉత్పత్తి అయిన వస్తువుల్ని లాభసాటిగా అమ్మడానికి మార్కెట్టుగా తమ అధీనంలోని వలస దేశాలను వాడుకోవడం జరిగింది. అందుకే ఇండియాలో కూడా ఈ ప్రభావం ప్రవేశించింది. తక్కువ ధరతో ఎక్కువ మన్నిక గల ఆకర్షణీయమైన వస్తువులను మన దేశంలో అమ్మడం మొదలు పెట్టారు. ఆ పోటీకి మన గృహ పరిశ్రమలు, కుటీర పరిశ్రమలు, చిన్నతరహా పరిశ్రమలు నిలువలేక పోయాయి, దాంతో కులవృత్తులు కుంటుపడ్డాయి. వృత్తి విద్యలతో జీవనం సాగించేవారిలో ఆర్థిక భద్రతా రాహిత్యం పెరిగింది. దాని వల్ల సామాజిక గౌరవం లోపించింది., అందువల్ల వృత్తి విద్యలను నేర్చుకునే వారి సంఖ్య క్రమేణా క్షీణించింది. దానికి తోడు వృత్తి విద్యలు శ్రమతో కూడుకున్న ఉపాధులు. కృతక విలువలకు విలువ నిచ్చే మధ్య తరగతి వర్గానికీ, దీనికీ పొంతన లేకుండా పోయింది.

పాలకులకు పాలిత భాష కంటే పాలనా భాష మీదే మమకారం ఎక్కువగా వుండడం సహజం. ఎందుకంటే పాలిత భాష వారికి కొత్తది. పాలనా భాష వారి మాతృభాషే అయివుంటుంది. బ్రిటీష్ వాళ్ళు రాజభాషగా ఇంగ్లీషును గ్రహించారు. వారి పరిపాలనా యంత్రాంగానికి పరికరాలుగా **(Tools of Administrative Machinery)** వ్యక్తులు కావలసి వచ్చారు. అందుకే లార్డ్ మెకాలే మన దేశంలో ఆంగ్ల విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టాడు. వాళ్ళు ఈ విద్యను ఎందుకు ప్రవేశపెట్టారో తెలిసి కూడా రాజారామమోహన రాయ్ లాంటి సంఘసంస్కర్త కూడా దాని కోసం తీవ్రంగా కృషి చేశాడు. ఒక విధంగా చూస్తే ఆయన చేసిన పని నేరంగా కన్పించవచ్చు కానీ బ్రిటీషు వాళ్ళు ఆంగ్లవిద్య ద్వారా వచ్చి విజాయతనీ -, మతాన్నీ, వాళ్ళ సంస్కృతినీ మన జీవితాల్లోకి ప్రవేశపెట్టినా ఆనాటి సామాజిక పరిస్థితుల్లో "మొల్ల రామాయణం చదివే దాని కన్నా చార్లెస్ డికెన్స్

నవలలు చదవటం మనకు ఎక్కువగా ఉపకరించింది." అందువల్ల ఇంగ్లీషు చదువు మన వాళ్ళకు ఇంగ్లీషులో ఆలోచించడం నేర్పింది. మన వాళ్ళలో ఆంగ్ల సాహిత్యాన్ని ఆరాధించే వాళ్ళు పెరిగారు. ఆంగ్ల సంస్కృతిని తలన పెట్టుకుని పూజించటం జరిగింది. కాళిదాసు ఏమి రాసాడో, భవభూతి ఏమి రాసాడో తెలీకుండా పోయింది. కానీ షేక్స్పియర్, మిల్టన్ థాకరే, బైరన్, వర్డ్స్ వర్త్, షెల్లీ, కీట్సు, డికెన్స్ మొదలయిన ఈ ఆంగ్ల రచయితల రచనలను చదివిన వాళ్ళు విద్యాధికులని అనిపించుకున్నారు. మన సమాజంలో యుగకర్తలని అనిపించుకున్న వాళ్ళందరూ పాశ్చాత్య సంస్కృతిలో మన సంస్కృతిని జోడించి అంతో యింతో ప్రభావితులై మనలను ప్రభావితం చేసిన వాళ్ళే. అందువల్ల మధ్య తరగతి కుటుంబాల వాళ్ళకు ఉపాధి దృష్ట్యా, సామాజిక గౌరవం దృష్ట్యా ఆంగ్ల విద్య మీద మోజు పెరిగిపోయింది.

దానికి తోడు మొదటి ప్రపంచ యుద్ధ ఛాయలు వాటి ప్రభావం వలన ధరలు పెరగడంతో మధ్యతరగతి వర్గం మీద ఆర్థిక ఒత్తిడి ఎక్కువైంది. మధ్యతరగతి ఎప్పుడు క్రిందికి పడిపోతున్నా దాని చూపంతా ఎప్పుడూ పైపైనే. క్రింది వర్గాల వారంటే వారికి చులకన భావం.

ఇలాంటి మధ్య తరగతి మనస్తత్వం గలవాళ్ళు, యిలాంటి చారిత్రక పరిస్థితులలో ఎలా ప్రవర్తిస్తారో సీతమ్మ అలాగే ప్రవర్తించింది. కొడుకు పెరిగి పెద్దవాడై బాగా సంపాందించి తమను ఉద్ధరించాలి. బాగా సంపాదించాలి అంటే మంచి ఉద్యోగం సంపాదించాలి అన్నమాట. పెద్ద ఉద్యోగం సంపాదించాలంటే బాగా చదువు కోవాలన్న మాట. చదువు అంటే సామాజిక విలువలు తారుమారైన తెలుగు, సంస్కృతం చదువు కాదు. ఇంగ్లీషు చదువే అని దాని అర్థం. వృత్తి విద్యలు నీచమని వారి అభిప్రాయం. పెద్ద చదువులు చదివితే శ్రమ పడకుండా బాగా డబ్బు హోదా సంపాదించే **'White Collar Jobs'** ను సంపాదివచవచ్చు. సాంఘిక స్థోమతను పెంచు కోవచ్చు. నాగరికుడనిపించుకోవచ్చు. పై కారణాల వల్ల మధ్య తరగతి వాళ్ళు తమ బిడ్డలను తమ తాహతులను మించి చదివించాలని తెగ తాపత్రయం చూపారు. చదివించడానికి ఎంత డబ్బు కావాలి? తగిలేసే డబ్బుకి ఏమన్నా ప్రయోజనం వుంటుందా? లేదా? అని వాళ్ళు ఆలోచించ లేదు. సీతమ్మకు వుండే ఈ తహతహే తల్లి చాటు బిడ్డ అయిన సుందరానికి వచ్చింది.

బిడ్డల చదువును నిర్ణయించడం కేవలం తల్లిదండ్రుల చేతులలో మాత్రమే వుండదు. వారికి చదువు పట్ల శ్రద్ధాసక్తులు కలిగించడానికి ఉపాధ్యాయులు ప్రయత్నించాలి. లేకపోతే ఆ ఆసక్తి క్షీణించి పోతుంది. వాళ్ళ ప్రవర్తన నిష్కారణంగా, కఠినంగా వుంటే పిల్లలకు చదువంటే భయం పట్టుకుంటుంది లేదా విరక్తి పుడుతుంది.

ఇక ఆనాటి వీధి బళ్ళో అపర నరకాలు. పిల్లలను తలగోడకేసి కొట్టడం - డొక్కల్లో తన్నడం - ఒక మూల నుంచి మరో మూలకు విసరడం - వాళ్ళ సున్నితమైన చేతులను మెలి పెట్టడం - గుంజీలు - గోడ కుర్చీలు - బండ కొయ్యలు... ఒక్కటేమిటి? ఆనాటి పంతుళ్ళ తెలివితేటలంతా వీటికి సరిపోయేవి.

గురుకుల విద్యావిధానం పోయినా వీధి బళ్ళలోని పంతుళ్ళలో మాత్రం ఆ సంప్రదాయసిద్ధపు అహంభావం మాత్రం "చింత చచ్చినా పులుపు చావనట్లు" చావలేదు. అప్పట్లో గురుకులాల్ని 'ఫ్యూడల్ లార్డ్స్' పోషించేవాళ్ళు. వారికి ఆర్థికంగా జరుగుబాటు బాగుండేది. సామాజికంగా తిరుగు లేకుండా ఏలారు. ఆ వ్యవస్థ పోయాక పోషకులు కరువయ్యారు. గురువులు వీధుల పాలయ్యారు. ఆంగ్ల విద్యను చదివిన వాళ్ళే విద్యాధికులయ్యారు. వారికేఉన్నత పదవులు లభించాయి. దాంతో ఈ గురువుల పరిస్థితి మరింత అధ్వాన్నంగా మారింది. ఆర్థిక

అభద్రత, సామాజిక అగౌరవం వల్ల వాళ్ళ అహం దెబ్బతినింది. అనిశ్చితత, ఆందోళన, అసంతృప్తి వాళ్ళ జీవితాల్లో బయలు దేరాయి. దీనికి కారణం ఆంగ్ల భాష. దాని మీద వాళ్ళకు అంతులేని ద్వేషం కలిగింది. కానీ దాన్ని ఏమీ చేయలేని నిస్సహాయత. అది 'అత్త మీద కోపం దుత్త మీదలా' అమాయకులైన ముక్కుపచ్చలారని పసిపిల్లల వైపుకు మళ్ళింది, వాళ్ళు పసితనం చేత సహజంగా చేసే అల్లరి పనులకు శిక్షణ పేరుతో యిలా దారుణంగా తమ కక్షను తీర్చుకున్నారేమో అనిపిస్తుంది.

జాతీయోద్యమ ఫలితంగా జాతీయ విద్యాలయాలను జాతీయ వాదులు స్థాపించారు,వీటిని స్వరాజ్యం బళ్ళు అన్నారు. వీటిలో వృత్తి విద్యలు  పెట్టారు.  ఆర్థికంగా జరుగుబాటు లేకపోవడం వల్ల యివి కొలదికాలంలోనే మూతపడ్డాయి. అందులో చేరడం వల్ల రామ్మూర్తి లాంటి వాళ్ళ చదువు దెబ్బ తినింది. చేరని కారణంగా సుందరం చదువు ముందుకు సాగింది.

చదువు అనేది జీవనోపాధికా? జీవన సంస్కారానికా? అనే చర్చ సుందరం ఫిఫ్తుఫారంలో చేరడం నుంచీ ప్రారంభం అవుతుంది.

సుందరానికి చదువే ఒక పరమాశయంగా బుద్ధిలో మెదులతోంది. వాడు లెక్కలు తీసుకుంటాను అనడంలో ఒక ఉద్దేశ్యం లేకపోలేదు. తెలివికలవాళ్ళంతా ఆ సబ్జెక్టు తీసికుంటారని వాడి భావన. కానీ ఆ సబ్జెక్టే తీసుకున్న వాళ్ళు మాత్రమే మంచి ఉద్యోగాలు చేస్తున్నారా? చదువును గురించి ఆలోచించేటప్పుడు ఎంత డబ్బు కావలసి ఉంటుంది? ఏ ఉద్యోగం వస్తుంది? అనేది ఆలోచించవలసి ఉంటుంది. ఎక్కువ చదువు చదివితే పెద్ద ఉద్యోగాలు వస్తాయనుకోవడం పొరపాటు. ఎందుకంటే చదువుకు తగ్గ ఉద్యోగాలు ఎక్కడ లభిస్తున్నాయి? అకడమిక్ చదువులు చదవడం వల్ల పెద్దగా జ్ఞానం అభివృద్ధి పొందదు.  జీవనోపాధికా అది పనికి రావడం లేదు.పై చదువుల చదవడానికి ఎక్కువ డబ్బుండాలి. ఆ డబ్బే వుంటే వ్యాపారం చేసుకుని, చదువుకుని ఉద్యోగాలు చేసే వాళ్ళకంటే ఎక్కువ సంపాదించవచ్చు. వృత్తి విద్యలు నేర్చుకుంటే జీవనోపాధిని చేపట్టడం తేలిక. ఈ విషయాలను గురించి చాలామంది విద్యార్థులు పట్టించుకోరు. వారికి కుటుంబరావు శ్రీనివాసరావు పాత్ర ద్వారా ఇచ్చే సలహా:

"చదువు గురించి ఆలోచించేటప్పుడు ఖర్చూ ఉద్యోగమూ ఆలోచించక పోవడం చాలా పొరపాటు. అసలే చదువులో వృత్తి విద్య చాలా తక్కువ. కనీసం స్కూలు ఫైనలయినా పాసు కాకపోతే ప్రపంచ జ్ఞానమే ఉండదు మరి. అందుచేత స్కూలు ఫైనలుతో నిలిపి వేస్తూ వృత్తి విద్య సంపాదించే దారి ఆలోచించాలి. కాలేజీ క్లాసులో మరింత ఇంగ్లీషూ, మరింత సబ్జెక్టులు చెబుతారు. అవి మన లోకజ్ఞానాన్నీ పెంచవు. వృత్తికీ పనికి రావు. అందుచేత స్కూలు ఫైనలుతో చదువు సరిపెట్టి పెందలాడే ఉద్యోగంలో ప్రవేశిస్తే సంసారం మీద పడే నాటికి నాలుగు రాళ్ళు తెచ్చుకోవచ్చు"

ఈ సలహా సుందరానికి కొంచెం కూడా రుచించలేదు. 'చదువు సొంతం చదువుకోవడానికి డబ్బు లెక్క చూడడమేమిటి? ఇప్పటి నుంచీ ఉద్యోగం సంగతి ఆలోచించడమేమిటి? వెనకటి రోజుల్లో చదువు కోసం కాశీ, నవద్వీపం వెళ్ళే వాళ్ళు, వాళ్ళు కష్టాలు, ఉద్యోగాలు చూశారా?' అని అనుకున్నాడే గాని ఆనాటి పరిస్థితులకు, తన సమకాలీన పరిస్థితులకు మధ్య వున్న తేడాను సుందరం స్పష్టంగా గుర్తించలేకపోయాడు. గతంలో బతకాలనుకున్నాడు.శ్రీనివాసరావు మాట విన్న నాగేశ్వరరావు బాగుపడ్డాడు. షార్ట్‌హాండ్ నేర్చుకుని తాలుకా

బోర్డు ఆఫీసులో టైపిస్టు ఉద్యోగం సంపాదించాడు. సంసారం లేకపోయినా సంసారం చేయగల స్థితికి ఎదిగాడు. తన ఖర్చు, ఇంట్లో ఖర్చులు పోగా కూడా పెళ్ళికి ముందే పోస్టల్ సేవింగ్స్‌లో నూరు రూపాయలు దాచుకోగలిగాడు. తన ఆర్థిక దుస్థితి, తాను పెళ్ళాన్ని సాకవలసిన స్థితి, తాను మామగారి పంచన వుండటం వీటితో పోల్చి చూసుకుని ఉంటే, సుందరానికి నాగేశ్వరరావు పరిస్థితిని చూసి తప్పక ఈర్ష్య కలిగి ఉండేది. కానీ వాడు "తక్కువ చదువు తక్కువ చదువే" బియ్యేలు పసయ్యే కన్నా స్కూలు ఫైనలూ, షార్ట్‌హాండ్ పాసై టైపిస్టు కావడం మెరుగనే వేదాంతం చాలా తప్పు. ప్రత్యక్షంగా ఉండే విలువల్ని తారుమారు చేయడం అన్నమాట. తాను బియ్యే పాసై వందలు ఆర్జించవచ్చు. నాగేశ్వరరావు తొమ్మిది నెలలలో దాచుకున్న మొత్తం తాను ఒక నెల జీతంలో వెనకవేయవచ్చు" అని కలలు గన్నాడు. ఒకప్పుడు పొలాల రాబడి మీద మనుషుల హెచ్చుతగ్గులు ఆలోచించే సుందరం జీతాల పరంగా ఆలోచించడం మొదలుపెట్టాడు. తనకుండే పొలానికి తోడు ముప్ఫై రూపాయల ఉద్యోగం వస్తే తాను 'మహారాజు' లాగా బతకవచ్చని గాలిలో మేడలు కట్టాడు. సుందరం బియ్యే పూర్తయింది, చదువు అయిపోకూడదనే ఆవేదనతో పాటు జీవితాన్ని గురించిన భయం అతన్ని ఆవహించింది. ఈ భయం వాడికి తెచ్చి పెట్టినవాళ్ళు వాడి భవితవ్యాన్ని గురించి మాట్లాడిన వాళ్ళే. సుందరం పసివాడై వుండగా వాడికి చదువు గురించీ, బడి గురించీ, ఎవరైనా భయపెట్టిపోతారేమో అని ఒకప్పుడు సీతమ్మ వేయ్యి కళ్ళతో కనిపెట్టింది. కానీ పదిహేనేళ్ళ అనంతరం ఆ సుందరానికి ఈ జీవితం గురించి భయం కలగకుండా కాపాడే వాళ్ళే కురువైపోయారు. అతడు ఏ ప్రక్కతిరిగినా జీవిత సముద్రంలో పడి ఈదలేకుండా కొట్టుకుంటున్న వాళ్ళే కనిపించారు. కానీ జీవిత శిఖరాన్నెక్కి నిర్మాణాలు చేసేవారు కనిపించలేదు. అందుకే సుందరం అందరూ వద్దని వాదిస్తున్నా బెనారసు బయలుదేరాడు. ఆర్థిక అభావం వల్ల అతని చదువు అర్ధంతరంగా ఆగిపోతుంది. సుందరం కొడుకు చదువు ప్రారంభం కావడంతో నవల ముగుస్తుంది.

ప్రతి దేశానికీ, కాలానికీ దానికి తగిన విద్యావిధానం వుంటూనే వచ్చింది, విద్యాభ్యాసం అంటే కేవలం చదువు కోవడమే అని పొరపడితే లిపి కనుక్కోబడే వరకు విద్యలేదని పొరబడ వలసి వస్తుంది. లేఖనం వచ్చాక కూడా అందరికీ చదువుకునే అవకాశం వుండివుంటుందా? అయినా వాళ్ళు తమ జీవితాన్ని పూర్తిగా అనుభవించలేదని చెప్పడానికి వీలుంటుందా? నిరక్షరాస్యులైన వాళ్ళలోనూ ఎంతో మంది కళాకారులు, వివిధ వృత్తులలో ప్రావీణ్యం వున్నవారూ వుండి వుంటారు.

ఆధునిక యుగంలోనే చదువుకొనే చదువుకూ జీవితానికి పనికి వచ్చే చదువుకూ అంతులేని వైరుధ్యం వచ్చింది. చదువుకు పుస్తకాలే మూలం అయిన పరిస్థితి కూడా ఏర్పడింది. ఒకప్పుడు మనిషి తన ప్రత్యక్ష అనుభవం ద్వారా నేర్చుకొనే చదువు సరిపోయేది, కానీ సమకాలీన ప్రపంచంలో కేవలం స్వీయ అనుభవ జ్ఞానం సరి పోతుందా? క్షణం క్షణం పెరిగి పోతున్న జ్ఞానాన్ని తెలుసుకోవడానికి పుస్తకాలను మించిన మార్గాంతరం వేరొకటి ఏముంది?

వ్యవస్థను బట్టి చదువు మారిపోతూ ఉంటుంది. ఫ్యూడల్ వ్యవస్థలో చదువు వేరు, బూర్జువా వ్యవస్థలో చదువు వేరు. అందువల్ల ఎలాంటి చదువు కావాలి? అనేది దేశకాల పరిస్థితులను బట్టి మారిపోతూ ఉంటుంది. కాబట్టి ఏ విద్యావిధానమూ శాశ్వతంగా అవలంబించేందుకు వీలులేదు. కాబట్టి ఈ విషయంలో సంప్రదాయానికి మినహాయింపులేదు. గురుకులాలు పోయాయి. సంస్థాగత విద్యావిధానం వచ్చింది.

వర్గ సమాజంలో ఏ వర్గానికి కావలసిన చదువు ఆ వర్గానికి వేరుగా వుంటుంది. ఉన్నవర్గాలు చదువుకిచ్చే ప్రాముఖ్యం లేని వర్గాలు యివ్వలేవు. ఎందుచేతనంటే లేని వాళ్ళు తమ జీవితాలలోని అవసరాలను గడపడానికే వాళ్ళ డబ్బూ, కాలం చాలదు. వర్గ సమాజం ఆరంభదశలో చాలామంది నిరక్షరాస్యులుగా వుంచబడతారు. ఉదాహరణకు మనదేశంలో బ్రిటీషు వారి వలస ఆర్థిక వ్యవస్థ వుండేటప్పుడు పదిశాతం మించి అక్షరాస్యులు లేరు.

జీవితానికీ విద్యకూ ఎలాంటి సంబంధం వుండాలని ఈ నవలలో కుటుంబరావు అభిప్రాయపడ్డాడు?

విద్యాలయాలు జీవితంలో భాగంగా వుండాలి కానీ వాటి నుంచి బయటకి వచ్చినాక ఏదో తెలియని లోకం లోకి అడుగుపెట్టినట్టు వుండగూడదు. అంటే విద్యావిధానమనేది విద్యార్థి జీవితానికి అనుకూలంగా వుండాలి.

విద్యలో జాతీయత అవసరం. అది లేనప్పుడు అలవడేది అంతర్జాతీయత కాదు. పచ్చి విజాతీయత. ఇక్కడ జాతీయత అంటే దామోదర్ సావర్కార్ లాంటి వాళ్ళు చెప్పే జాతీయ దురహంకారం కాదు.

వర్గ సమాజంలో ఈ రెండూ సాధ్యం కావు. సమసమాజంలో నగరాలకు - పల్లెటూళ్ళకు ; శ్రామికులకు- మేధావులకు; స్త్రీలకు- పురుషులకు; విద్యార్థులకు - అధ్యాపకులకు యిలాంటి ఎన్నో ద్వంద్వాల మధ్య వుండే వైరుధ్యం పరిష్కరింప బడుతుంది. అదే అసలైన ప్రజాజీవిత లక్ష్యం. ఇదే లక్ష్యం మన విద్యావిధానంలో కూడా ద్యోతకం కావాలని ఈ నవలలో కుటుంబరావుగారు స్పష్టంగా చెబుతారు.

back to book of the week home page

❖ఈ విశేష సమీక్షా వ్యాసం శ్రీ కొడాలి సత్యనారాయణ (మిచిగన్ -యు.ఎస్.ఎ.) గారి వదాన్య సౌజన్యంతో అందించబడింది.